గురు వారం
4-1-2024
సంపుటి - 09,
సంచిక - 422
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra P

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## ఇస్రో కొత్త ప్రయోగం, త్వరలో అంతరిక్షంలోకి

# భారత వ్యోమగాములు




### ఇస్రో, భారత వైమానిక దళం సంయుక్తంగా చేపట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమం షురూ !

**శ్రీహరికోట, జనవరి 3 (సమ సమాజం):** ప్రపంచ దేశాలన్నీ మన అంతరిక్ష పరిశోధన సంస్థను కీర్తిస్తు న్నాయి. ఇప్పటిదాకా మనుషుల్ని అంతరిక్షంలోకి పంపిన అనుభవం లేదు మనకు. ఆ లోటూ త్వరలోనే తీరనుంది. మానవసహిత అంతరిక్ష కార్యక్రమాల కోసం వ్యోమగాముల ఎంపిక ప్రక్రియా మొదలైపో యింది. ఇస్రో, భారత వైమానిక దళం సంయుక్తంగా చేపట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమం ఇది. ఈ ప్రాజెక్టుతో రష్యా, అమెరికా, చైనాల సరసన మనమూ చేరనున్నాం. ప్రయోగించే ప్రతి ఉపగ్రహానికీ ఒక వాహక నౌకను తయారు చేసుకోవడం అంటే, వేలకోట్ల రూపాయల వ్యవహారం. అది కూడా ఒక్కసారికే పనికొస్తుంది. అదే నౌకను వెనక్కి రప్పించుకుని, మళ్లీ మళ్లీ ఉపయోగిస్తే - బొక్కసానికి భారం తగ్గుతుంది. అంతరిక్ష ప్రయోగాల వ్యయమూ ఎనభైశాతం మేర పడిపోతుంది. ఆ ఆలోచనతోనే... ఇస్రో పునర్వినియోగ వాహక నౌకను రూపొందించింది. ప్రయోగాత్మకంగా శ్రీహరికోట నుంచీ 65 కిలోమీటర్ల ఎత్తు వరకూ పంపి, మళ్లీ వెనక్కి తెప్పించింది. ఆ ఉత్సాహంతోనే ఈసారి ఇంకో అడుగు ముందుకేయబోతోంది.అంతరిక్ష రేసులో భారత్ అగ్రస్థానంలో దూసుకెళ్లుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు అమెరికా, రష్యా మధ్య ఉన్న స్పేస్‌వార్ ఇప్పుడు ఆసియాలో కనిపిస్తున్నదన్నా ఆశ్చర్యం లేదు. గతంలో రష్యా మాత్రమే అత్యధిక స్థాయిలో ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపింది. 2014లో 37 ఉపగ్రహాలను ఒకేసారి కక్ష్యలోకి ప్రయోగించింది. ఇప్పుడు దానికి మూడు రెట్లు మన ఇస్రో ప్రయోగాన్ని పూర్తి చేసింది. భారత్‌తో పాటు చైనా, జపాన్ అంతరిక్ష సంస్థలు కూడా సాహసోపేతమైన అంతరిక్ష ప్రయోగాలకు సిద్ధంఅవుతున్నాయి. చిన్న దేశమైన దక్షిణ కొరియా కూడా ఈ రేసులో పాల్గొనేందుకు ఉత్సాహం ప్రదర్శిస్తున్నది. ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాల్లో అమెరికాతో పాటు కజకిస్తాన్, ఇజ్రాయిల్, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, యూఏఈ దేశాలకు చెందిన శాటిలైట్స్ ఉన్నాయి. ఒకేసారి అత్యధిక స్థాయిలో ఉపగ్రహాలను పంపడం వల్ల ఖర్చు సుమారు 60 నుంచి 70 శాతం వరకు తగ్గుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ దశాబ్దం చివర వరకు చైనా కూడా అంతరిక్ష అద్భుతానికి సన్నాహాలు చేస్తున్నది. చైనా ఏకంగా చంద్రుడి మీదే అడుగుపెట్టాలని భావిస్తున్నది. ఆ దిశగా డ్రాగన్ దేశం ప్రయోగాలు కొనసాగిస్తున్నది. మార్స్ గ్రహం మీద రోవర్ కూడా దించేందుకు ఆ దేశం ఆలోచిస్తున్నది. జపాన్ కూడా మూన్ లక్ష్యంగా ప్రయోగాలను నిర్వహిస్తున్నది. 2018లోగా చంద్రుడి

3వ పేజీలో...

## ఆరు గ్యారెంటీలపై మంత్రి వాఖ్యలు

వందశాతం అమలు చేసి తీరుతాం

మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**హైదరాబాద్, జనవరి 3 (సమ సమాజం):** కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా 6 గ్యారంటీలను అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజా పాలనలో భాగంగా అభయహస్తం కింద తమ హామీలను, పథకాలను వందశాతం అమలు చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా

3వ పేజీలో...

## తెలంగాణలో 26మంది ఐఏఎస్‌ల బదిలీ

ఫైనాన్స్ కమిషన్ సభ్య కార్యదర్శిగా స్మితా సబర్వాల్



**హైదరాబాద్, జనవరి 3 (సమ సమాజం):** తెలంగాణలో 26 మంది ఐఏఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. పలువురు అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ మేరకు

3వ పేజీలో...

## గృహలక్ష్మి పథకం రద్దు




**హైదరాబాద్, జనవరి 3 (సమ సమాజం):** బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన గృహలక్ష్మి పథకాన్ని ఉపసంహకరిస్తూ ప్రస్తుత ప్రభుత్వం జివో జారీ చేసింది. గృహలక్ష్మి పథకం కింద నాలుగు లక్షల ఇళ్లకు మూడు లక్షల ఆర్థిక సహాయం(100 శాతం సబ్సిడితో) అందజేసేందుకు గత ప్రభుత్వం నిర్దేశిరచింది. ఇందుకు సంబంధించి 2,12,095 మంది లబ్దిదారులకు శాం క్షన్ ఆర్డర్లను ఆయా జిల్లా కలెక్టర్లు మంజూరు చేశారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం పేరిట ఆరు గ్యారంటీలలో

3వ పేజీలో...

## కిలాడీ లేడీపై 17 కేసులు..

లిఫ్ట్ అడిగి బ్లాక్ మెయిల్ చేస్తోన్న మహిళా

కిలాడీ లేడీని అరెస్ట్ చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు



3వ పేజీలో...

# మెట్రోరైలు విస్తరణపై స్పష్టత ఇచ్చిన రేవంత్ సర్కార్



**హైదరాబాద్, జనవరి 3 (సమ సమాజం):** హైదరాబాద్ నగరంలో మెట్రోరైలు విస్తరణపై కొత్త ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గతం లో ప్రతిపాదించిన కొన్నింటిని నిలిపేస్తూ.. మరికొన్నింటిని కొనసాగిస్తూ.. కొత్తగా కొన్ని మార్గాల్లో పొడిగించాలని నిర్ణయించింది. ఎక్కువ ప్రాంతాలను కలిపేలా మార్గాలను నిర్దేశించింది. ఐదు మార్గాలలో 76 కి.మీ. మేర మెట్రో విస్తరణ తమ ప్రాధాన్యమని స్పష్టం చేసింది. ఐటీ కారిడార్‌కు ఇప్పటివరకు సరైన ప్రజారవాణా లేదు. రాయదుర్గం వరకే మెట్రో ఉంది. దీంతో ఇక్కడి నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ చేరుకోవడానికి ఉదయం గంటన్నరపాటు ట్రాఫిక్‌లో నరకంగా ఉంటోంది. కొత్తగా విస్తరించే మార్గాల్లో రాయదుర్గం నుంచి గచ్చిబౌలి, విప్రో, అమెరికన్ కాన్సులేట్, ÷నాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు 12 కి.మీ. నిర్మించనున్నారు. దీంతో ట్రాఫిక్ కష్టాల నుంచి ఊరట లభి స్తుంది. మరోవైపు ఎక్కువ మంది ప్రయోజనం కల్గించే మార్గాలపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించిం ది. జాతీయ రహదారి కూడలిలో..: బెంగళూరు జాతీయ రహదారి సిటీలోకి ప్రవేశించే ఆరాంఘర్ వద్ద నిత్యం ఎంతో రద్దీగా ఉంటుంది. దూర ప్రాంత బస్సుల కోసం ఇక్కడే ఎక్కువ మంది ఎదురు చూస్తుంటారు. ఈ ప్రాంతానికి మెట్రో అనుసంధానం లేకపోవడంతో సిటీకి చేరుకోవడానికి ట్రాఫిక్‌లో ఎక్కువ సమయం పడుతోంది. నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఎల్బీనగర్ నుంచి చంద్రాయణగుట్ట జంక్షన్, అక్కడి నుంచి ఆరాంఘర్ వరకు మెట్రోని విస్తరించాలని నిర్ణయించి అధ్యయనం చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. 19 కి.మీ. ఉండే ఈ మార్గం కొత్త హైకోర్టు నిర్మించే ప్రాంతాన్ని కూడా కలుపుతుంది.

# రాష్ట్రానికి అమరరాజా..

లిథియం అయాన్ బ్యాటరీల తయారీకి సంసిద్ధం

దివిటిపల్లిలో గిగా ప్రాజెక్టు ఏర్పాటుకు అంగీకారం

భారీ పెట్టుబడులు పెట్టనున్న అమర్ రాజా

సిఎం రేవంత్ రెడ్డితో సంస్థ ఆశికారులు భేటీ



**హైదరాబాద్, జనవరి 3 (సమ సమాజం):** తెలంగాణలో పెట్టుబడులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమర్ రాజా కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా జయదేవ్ సంప్రదింపులు జరిపారు. అమర రాజా ఎనర్జీ మొబిలిటీ (గతంలో అమర రాజా బ్యాటరీస్) రాష్ట్రంలోని దివిటిపల్లిలో లిథియం అయాన్ బ్యాటరీల తయారీకి సంబంధించిన గిగా ప్రాజెక్టు నెలకొల్పుతోంది. ఈ పరిశ్రమల స్థాపనకు సంబంధించిన పురోగతిపై బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గల్లా జయదేవ్ తో చర్చలు జరిపారు. తెలంగాణ ప్రభుత్వం అందించే సహాయ సహకారాలపై సమావేశంలో చర్చించారు. అమర రాజా ఎనర్జీ మొబిలిటీ భారతదేశంలోని ప్రముఖ ఎనర్జీ స్టోరేజ్, మొబిలిటీ ఎంటర్‌ప్రైజ్‌లో ఒకటి. పారిశ్రామిక,

2వ పేజీలో...

## బంజారా చరిత్రపై పుస్తకం

ఆవిష్కరించిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జనవరి 3 (సమ సమాజం):** లిఖిత చరిత్ర లేని బంజారా గిరిజన తెగ ఘనమైన చరిత్రను పుస్తక రూపంలో సమాజానికి అందించడం అభినందనీయమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉస్మానియా



3వ పేజీలో...

## జనవరి 12నుంచి సంక్రాంతి సెలవులు

ఆరు రోజులపాటు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం



3వ పేజీలో...

## రెజ్లింగ్ సంక్షోభం కొత్త మలుపు

జంతర్ మంతర్ వద్ద వందలాది రెజ్లర్ల నిరసన ♦ బజరంగ్, సాక్షి మాలిక్, వినేష్‌లకు వ్యతిరేకంగా నినాదాలు

**న్యూఢిల్లీ, జనవరి 3 (సమ సమాజం):** వందలాది మంది జూనియర్ రెజ్లర్ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనకు దిగారు. తమ కెరీర్‌లో ఒక కీలకమైన సంవత్సరాన్ని కోల్పోయామని రెజ్లర్లు నిరసనకు పిలుపునిచ్చారు. అయితే ఈ సారి మాత్రం



3వ పేజీలో...

# పలు జిల్లాల్లో లోక్ సభ స్థానాలపై కామ్రేడ్ల గురి

## సీఎం రేవంత్ రెడ్డితో సీపీఐ నేతలు సంప్రదింపులు!!


## ఖమ్మం, వరంగల్, నల్గొండ స్థానాల్లో పోటీకి ప్లాన్

హైదరాబాద్,జనవరి 3 (సమ సమాజం): తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసి నయా సర్కార్ పాలన పట్టాలెక్కింది. దీంతో ప్రధాన పార్టీలన్నీ ఇక పార్లమెంట్ ఎన్నికలపై ఫోకస్ పెట్టాయి. మెయిన్ పార్టీలతో కలిసి వెళ్లేందుకు చిన్న పార్టీలు సైతం పావులు కదుపుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసిన వెళ్లిన కామ్రేడ్లు, లోక్ సభ బరిలోనూ అదే అవగాహనతో వెళ్లాలని ప్లాన్ చేస్తున్నాయి. ఒక్క ఎంపీ సీటు ఇవ్వండి.. మళ్లీ ఇరగదీద్దాం అంటూ సీఎం రేవంత్ రెడ్డితో సీపీఐ నేతలు సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇంతకీ ఎర్రసైన్యం ఏ సీటు అడుగుతోంది.? కాంగ్రెస్ పార్టీతో కలిసి అసెంబ్లీ మాదిరి పార్లమెంట్ లోనూ ఓ పాదం మోపుతారా..? కలిసివచ్చిన కాలాన్ని అంది పుచ్చుకోవాలన్న చందంగా కామ్రేడ్లు కదం తొక్కుతున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా ఒక స్థానంలో పోటీ చేసిన సీపీఐ భారీ విజయం సాధించింది. దీంతో అదే ఊపులో, అదే పొత్తుతో పార్లమెంట్ ఎన్నికల్లోనూ సత్తా చాటాలని సీపీఐ నేతలు భావిస్తున్నారు. అన్ని పార్టీలు లోక్ సభ ఎన్నికలపై సమాయత్తం అవుతున్న వేళ కామ్రేడ్లు కూడా పక్కా ప్లాన్ తో ముందుకు వెళ్తున్నారు. జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో ఉన్న సీపీఐ తెలంగాణలో అదే పంథా కొనసాగిస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తో కలిసి వెళ్లినట్లు పార్లమెంట్ ఎన్నికల్లోనూ తెలంగాణలో పొత్తుతో పోటీ చేస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని భావిస్తున్నారట. ఇందులో భాగంగానే లోక్ సభ ఎలక్షన్స్‌లోనూ కాంగ్రెస్‌తో కలిసి వెళ్లాలని అనుకుంటున్నామని గతంలోనే సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ చెప్పారు. అదే అంశాన్ని సిపీఐ నేతలంతా కలిసి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సచివాలయంలో కలిసి చెప్పారట. శాసన సభలో సీపీఐ కాంగ్రెస్ పొత్తు సత్ఫలితాలు ఇచ్చినందున.. లోక్ సభ ఎన్నికల్లో అదే అవగాహనతో పోటీ చేసి పరస్పరం సహకరించుకుందామని సీపీఐ నేతల బృందం రేవంత్ రెడ్డిని కోరింది. కామ్రేడ్ల పట్టున్న ఖమ్మం, నల్గొండ స్థానాల్లో ఏదో ఒక్కటి ఇస్తే చాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి తమ పార్టీ అధిష్టానమే ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటుందని చెప్పినట్లు తెలుస్తోంది. ఇక సీపీఐ ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో తమ ప్రాబల్యాన్ని చాటింది. దీంతో ఆయా జిల్లాలోనే లోక్ సభ స్థానాల్లో తమకు అవకాశం ఇస్తే కాంగ్రెస్ అవగాహనతో గెలిచి తీరుతామని కామ్రేడ్లు చెబుతున్నారు. ఖమ్మం లోక్ సభ స్థానం నుంచి గతంలో పోటీ చేసిన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మరోసారి ఆ సీటును ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఖమ్మం లోక్ సభ స్థానం సీపీఐకి కేటాయించి గెలిచేందుకు సహకరించాలని కాంగ్రెస్ కు సీపీఐ నేతల బృందం విన్నవించింది. అది కుదరకపోతే నల్గొండ స్థానం అయిన ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. 2014లో ఖమ్మం నుంచి పోటి చేసి ఓడిపోయిన నారాయణ.. కాంగ్- కమ్యూనిస్టుల పొత్తుతో ఈసారి గట్టెక్కొచ్చని భావిస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొత్తులో భాగంగా ఒక ఎమ్మెల్యే, రెండు ఎమ్మెల్సీ స్థానాల అవగాహన కాంగ్రెస్ %--% సీపీఐ మధ్య కుదిరింది. ఇప్పుడు రెండు ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించడంతో పాటు లోక్ సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేద్దామంటూ కాంగ్రెస్ ముందు కమ్యూనిస్టులు ప్రతిపాదన ఉంచారు. కాంగ్రెస్ అధిష్ఠానం మరి సీపీఐకి కఒక్క లోక్ సభ స్థానం రాష్ట్రంలో కేటాయిస్తోందో లేదో వేచి చూడాలి..!

# మహిళలపై నేరాలలో ఉత్తరప్రదేశ్ టాప్

న్యూ ఢిల్లీ, జనవరి 3 (సమ సమాజం): దేశంలో మహిళలపై అత్యధిక నేరాలు ఉత్తరప్రదేశ్‌లోనే జరుగు తున్నాయి. దేశం మొత్తం మహిళలపైన జరిగిన నేరాల్లో 55 శాతం ఒక్క యూపీ లోనే జరిగాయి. ఈ మేరకు జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) గతేడాది మహిళలపై నేరాలకు సంబంధించి నివేదిక విడుదల చేసింది. దేశం మొత్తం మహిళలపై నేరాలకు సంబంధించి 28,811 ఫిర్యాదులు నమోదయ్యాయని, అందులో 55 శాతం ఉత్తరప్రదేశ్‌కు చెందినవని పేర్కొంది.ఎన్‌సిడబ్ల్యు డేటా ప్రకారం.. గృహ హింస కాకుండా వేధింపులతో కూడిన గౌరవ హక్కు కేటగిరిలో అత్యధిక సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. వేధింపులతో కూడిన గౌరవ హక్కు 8,540 కేసులు నమోదయ్యాయి. దీని తర్వాత గృహ హింసపై 6,274 ఫిర్యాదులు అందాయి. వరకట్న వేధింపుల ఫిర్యాదులు 4,797, వేధింపుల ఫిర్యాదులు 2,349, మహిళలపై పోలీసు ఉదాసీనత 1,618, అత్యాచారం, అత్యాచారానికి ప్రయత్నించిన ఫిర్యాదులు 1,537గా నమోదయ్యాయి. లైంగిక వేధింపులపై 805 ఫిర్యాదులు, సైబర్ క్రైమ్‌లపై 605, స్టాకింగ్‌పై 472, గౌరవ నేరాలకు సంబంధించి 409 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 16,109, ఢిల్లీలో 2,411, మహారాష్ట్రలో 1,343 ఫిర్యాదులు నమోదయ్యాయి. బీహార్‌లో 1,312, మధ్యప్రదేశ్‌లో 1,165, హర్యానాలో 1,115, రాజస్థాన్‌లో 1,011, తమిళనాడులో 608, పశ్చిమ బెంగాల్‌లో 569, కర్ణాటకలో 501 ఫిర్యాదులు నమోదయ్యాయి. 2022 నుండి 30,864 ఫిర్యాదులు అందగా, 2023లో 28,811 ఫిర్యాదులు నమోదయ్యాయి.

# ఈ నెల 5న దావూద్ చిన్ననాటి ఇల్లు వేలం



న్యూఢిల్లీ, జనవరి 3 (సమ సమాజం): ముంబై వరుస బాంబు పేలుళ్ల నిందితుడు, ఉగ్రవాది దావూద్ ఇబ్రహీం చిన్న నాటి ఇంటితో పాటు అతడి కుటుంబానికి చెందిన మూడు వ్యవసాయ భూములను ఈ నెల 5న వే లం వేయనున్నారు. ఈ ఆస్తులన్నీ ముంబాకే గ్రామంలో ఉన్నాయి. చట్ట ప్రకారం సీజ్ చేసిన ఈ ఆస్తుల మొత్తం విలువ రూ.19 లక్షలు. దావూద్ ఇబ్రహీంకు చెందినవని కావడం వల్ల వీటిని అమ్మ డానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో వీటిని వేలం వేయాలని అధికారులు నిర్ణయించారు. వేలంలో పాల్గొనడానికి ఈ నెల 3లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

# మరింతగా పెరిగిన చలి.. ఆ రాష్ట్రాల్లో పరిస్థితి ఇదే!



న్యూఢిల్లీ, జనవరి 3 (సమ సమాజం): ఉత్తరాది రాష్ట్రాల్లో చలి మరింతగా పెరిగింది. దట్టమైన పొగమం చు కూడా కమ్ముకుంటోంది. జమ్మూ కాశ్మీర్ నుండి బీహార్, పంజాబ్ వరకు, హర్యానా నుండి తూ ర్పు ఉత్తరప్రదేశ్ వరకు చలి తీవ్రత మరింతగా పెరిగింది. హిమాచల్‌లోని కుకుమ్‌సేరిలో ఉష్ణోగ్రత లు మైనస్ 7.5 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. పహల్గామ్‌లో మైనస్ 6.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పర్వతప్రాంతాల్లో కురుస్తున్న హిమపాతం కారణంగా, దేశ రాజధాని, దాని పరిసర ప్రాంతాలలో మంగళవారం రోజంతా చలిగాలులు కొనసాగాయి. ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 8.3 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఇది సాధారణం కంటే ఒక డిగ్రీ ఎక్కువ. ఉత్తర భారతదేశంలో పొగమం చు ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా మారింది.జనవరి 5 నుంచి 11వ తేదీ వరకూ రాత్రి ఉష్ణోగ్రతలు మరిం తగా తగ్గే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం డైరెక్టర్ జనరల్ (ఐఎండీ) డాక్టర్ మృత్యుం జయ్ మహపాత్ర తెలిపారు. దీని ప్రభావంతో మధ్య భారతదేశంలో చలిగాలుల పరిస్థితి తీవ్రంగా మారవచ్చు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని ఉత్తర భాగం, ఉత్తరప్రదేశ్‌లోని దక్షిణ భాగంలో పగటి ఉష్ణోగ్రతలు కూడా దిగజారే అవకాశాలున్నాయి. ఎత్తయిన పర్వత శిఖరాలపై మంచు కురుస్తుండ టంతో కాశ్మీర్ లోయ తీవ్రమైన చలిలో చిక్కుకుంది. జమ్మూ కాశ్మీర్‌లో పొగమంచు కారణంగా రైలు, విమాన సర్వీసులు దెబ్బతింటున్నాయి. శ్రీనగర్ వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం జనవరి 4, 5 తేదీలలో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలతో పాటు మంచు కురిసే అవకాశం ఉంది. జనవరి 8న కూడా ఇలాంటి వాతావరణ పరిస్థితులే ఉండనున్నాయి.

# అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి పవన్‌కళ్యాణ్‌కు ఆహ్వానం



అమరావతి,జనవరి3(సమ సమాజం): అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి రావాలని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు ఆహ్వానం అందింది. బుధవారం మధ్యాహ్నం పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ కళ్యాణ్‌కు ఆర్ఎస్ఎస్ ప్రాంత సంపర్క ప్రముఖ్ ముళ్లపూడి జగన్ ఆహ్వాన పత్రిక అందించారు. ఈ భేటీలో విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస రెడ్డి, ఆర్.ఎస్.ఎస్ కార్యాలయ ప్రముఖ్ శ్రీ పూర్ణ ప్రజ్ఞ పాల్గొన్నారు. ఆహ్వాన పత్రిక అందించి అయోధ్య రామ మందిర నిర్మాణ విశేషాలు తెలిపారు. ఇదిలా ఉండగా.. 2024 జనవరి 22న అయోధ్యలో రామమందిరం ప్రాణప్రతిష్ఠ జరగనుంది. ఈ వేడుకకు ప్రపంచ నలుమూలల నుంచి ప్రముఖులు తరలిరానున్నారు. రజనీకాంత్‌తో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ, రతన్‌టాటాలకు కూడా ఆహ్వానం అందింది. జనవరి 22 మధ్యాహ్నం 12.20 గంటలకు శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమం జరగనుంది. ఈ విషయాన్ని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు.

# హైదరాబాద్ చర్లపల్లిలో భారీ పేలుడు



హైదరాబాద్, జనవరి 3 (సమ సమాజం): ఈ ఉదయం హైదరాబాద్ లోని చర్లపల్లిలో భారీ పేలుడు సం భవించింది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో భారీ శబ్దంతో చోటుచేసుకున్న పేలుడు ధాటికి మ్యాన్ హోల్ మూత ఎగిరిపడింది. దాంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికుల ద్వారా సమా చారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పరి శ్రమల వ్యర్థాలను డ్రైనేజీలోకి వదలడంతో ఈ పేలుడు సంభవించినట్లు పోలీసులు అనుమానిస్తు న్నారు. చర్లపల్లిలోని వెంకట్‌రెడ్డి నగర్‌లో గల మధుసూదన్‌రెడ్డి నగర్‌లో ఈ అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## మరోసారి తల్లికాబోతున్న సీమా హైదర్



గ్రేటర్ నోయిడా, జనవరి 3 (సమ సమాజం): పాకిస్తానీ మహిళ సీమా హైదర్ , ఉత్తరప్రదేశ్‌కు చెందిన సచిన్ మీనా ప్రేమ కథ గురించి అందరికీ తెలిసిందే. పబ్జీ గేమ్ ద్వారా పరిచయమైన సచిన్ కోసం సీమా తన నలుగురి పిల్లలతో అతి కష్టంమీద పాకిస్థాన్ నుంచి భారత్ లోకి అడుగుపెట్టి అందరి దృష్టిని ఆకర్షించింది. అక్రమంగా భారత్‌కు వచ్చిన ఆమె ఇప్పుడు ఓ సెలబ్రిటీ అయిపోయింది. సచిన్‌ని పెళ్లాడిన సీమా వైవాహిక జీవితాన్ని సాఫీగా కొనసాగిస్తోంది. ఈ క్రమంలోనే కొత్త ఏడాది శు భవార్త పంచుకుంది. తాను గర్భందాల్చినట్లు వెల్లడించింది. భర్త సచిన్ బిడ్డకు తల్లికాబోతున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఓ ప్రైవేట్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ శుభవార్త పంచుకుంది. పాక్ జాతీయురాలైన 30 ఏళ్ల సీమా హైదర్.. ఉత్తరప్రదేశ్ కు చెందిన 22 ఏళ్ల సచిన్ మీనా తో పబ్జీ గేమ్ ద్వారా ప్రేమలో పడింది. అతడి కోసం నలుగురు పిల్లలతో సహా పాక్ సరిహద్దును దాటి గతేడాది భారత్ లోకి అక్రమంగా అడుగుపెట్టింది. అనంతరం సచిన్ మీనాను వివాహం చేసుకున్న సీమా.. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ లోని గ్రేటర్ నోయిడాలో నివాసముంటోంది.

# రాష్ట్రానికి అమరరాజా..



(మొదటి పేజీ తరువాయి) ఆటోమోటివ్స్ రంగంలో ఉపయోగించే బ్యాటరీల తయారీదారులలో అతిపెద్ద కంపెనీ. పెరుగుతున్న ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఎనర్జీ స్టోరేజ్ మార్కెట్‌కు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీని ప్రవేశపెట్టేందుకు మహబూబ్ నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా ఒక గిగా కారిడార్‌ను ఏర్పాటు చేస్తోంది. దేశంలోనే పెద్దదైన అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (%ూజజ%), లిథియం-అయాన్ బ్యాటరీ తయరీ ఫ్యాక్టరీని ఇక్కడ నెలకొల్పుతోంది. తెలంగాణ న్యూ ఎనర్జీ పార్క్, బ్యాటరీ ప్యాక్ అసెంబ్లింగ్ యూనిట్, శంషాబాద్‌లోని ఇ-పాజిటివ్ ఎనర్జీ ల్యాబ్స్ పేరుతో రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. మొత్తం రూ.9,500 కోట్ల పెట్టుబడులకు కంపెనీ ముందుకొచ్చింది. దీంతో దాదాపు 4,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. దాదాపు అదే సంఖ్యలో పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి పథంలో అమర రాజా కీలక భాగస్వామి అని అన్నారు. తెలంగాణలో ఆ కంపెనీ తలపెట్టిన పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తగినంత సహాయ సహకారాలను అందిస్తుందని భరోసా ఇచ్చారు. అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ గిగా ఫ్యాక్టరీ, ప్యాక్ అసెంబ్లీ, ఇ పాజిటివ్ ఎనర్జీ ల్యాబ్‌ల నిర్వహణకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. క్లీన్ ఎనర్జీకి తెలంగాణ కట్టుబడి ఉందని, అడ్వాన్స్ కెమిస్రీ సెల్ వంటి అధునాతన స్టోరేజీ టెక్నాలజీలకు, కొత్త పరిశ్రమల స్థాపనకు తెలంగాణ రాష్ట్రం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. తమ ప్రాజెక్టును వేగంగా అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న మద్దతుకు అమర రాజా ఎనర్జీ %ం% మొబిలిటీ చైర్మన్ %ం% మేనేజింగ్ డైరెక్టర్ జయదేవ్ గల్లా ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో తమ ప్రాజెక్టును మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రోజురోజుకు విస్తరిస్తున్న ఎలక్ట్రానిక్ వెహికల్స్, న్యూ ఎనర్జీ రంగంలో తెలంగాణ ప్రభుత్వం ప్రధాన భూమిక పోషిస్తోందని, కొత్త పరిశ్రమల స్థాపనకు తగినంత మద్దతును ఆశిస్తున్నామని అన్నారు. న్యూ ఎనర్జీ, లిథియం అయాన్ బ్యాటరీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలతో పాటు వివిధ రంగాలలో

# సమ్మె ముగిసింది.. రోడ్డెక్కిన ట్రక్కులు

న్యూ ఢిల్లీ, జనవరి 3 (సమ సమాజం): హిట్ అండ్ రన్ కేసుల్లో ప్రతిపాదిత కఠిన చట్టాలను నిరసిస్తూ లారీలు, ట్రక్కుల డ్రైవర్లు చేపట్టిన సమ్మె మంగళవారం దేశవ్యాప్త గందరగోళానికి, అత్యవసర సేవల్లో తీవ్ర అంతరాయానికి దారి తీసింది. ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు కూడా సమ్మెలో పాల్గొన డంతో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత ఏర్పడింది. సమ్మె రోజుల పాటు కొనసాగుతుందన్న వార్తల నేపథ్యంలో దేశమంతటా వాహనదారులంతా పెట్రోల్ బంకులకు పోటెత్తారు. దాంతో ఎక్కడ చూసినా బంకుల ముందు భారీ క్యూ లైన్లే దర్శనమిచ్చాయి. ఇది నగరాలు, పట్టణాల్లో భారీ ట్రాఫిక్ జామ్‌లకు దారితీసింది. అత్యధిక బంకుల్లో చూస్తుండగానే నిల్వలు అడుగంటి నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. వంట గ్యాస్ సిలిండర్లతో పాటు కాయగూరలు, ఇతర నిత్యావసరాల సరఫరా కూడా నిలిచిపోయి జనం తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. కేంద్రంతో ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఏఐఎంటీసీ) జరిపిన చర్చలు ఎట్టకేలకు మంగళవారం రాత్రికి ఫలించాయి. కొత్త చట్టాన్ని ఇప్పటికిప్పుడే అమలు చేయడం లేదని కేంద్రం తరఫున హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా వారికి హామీ ఇచ్చారు. దానిపై ఏఐఎంటీసీతో లోతుగా చర్చించాకే నిర్ణయం తీసుకునేలా అంగీకారం కుదిరిన్నట్టు సంఘం చైర్మన్ మల్కిత్‌సింగ్ బల్ తెలిపారు. దాంతో సమ్మె విరమిస్తున్న ట్టు సంఘం ప్రకటించింది.



# జనవరి 12నుంచి సంక్రాంతి సెలవులు



(మొదటి పేజి తరువాయి) హైదరాబాద్, జనవరి 3 (సమ సమాజం): తెలంగాణ సర్కార్ సంక్రాంతి పండుగకు సంబంధించి అధికారికంగా పాఠశాలలకు సెలవులను ప్రకటించింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో జనవరి 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు సెలవులు ఉంటాయని ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ క్రమంలోనే మిషనరీ స్కూళ్లకు మినహా అన్ని స్కూళ్లకు ఈ సెలవులు వర్తిస్తాయని వెల్లడించింది. సంక్రాంతి సెలువులు జనవరి 12న తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.. మరుసటి రోజు రెండో శనివారం, తర్వాత 14 ఆదివారం భోగి పండుగ కాగా.. 15వ తేదీ సోమవారం సంక్రాంతి పర్వదిన వస్తోంది. ఇక, 16వ తేదీన కనుమ పండగ ఉంది.. కాగా, 17వ తేదీన ప్రభుత్వం పాఠశాలలకు అదనంగా సెలవు ఇచ్చింది. దీంతో ఆరు రోజుల పాటు స్కూల్స్‌కు హాలీడేస్ వస్తున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థలు సిలబస్ పేరిట పండుగ హాలీడేస్‌లలో క్లాసులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ తెలిపింది. కాగా జనవరి 25న ఆదివారం, 26 రిపబ్లిక్ డే వరుస సెలవులు కూడా రాబోతున్నాయి. ఇక, ఇంటర్మీడియట్ బోర్డు సైతం సంక్రాంతి పండగకు సంబంధిచి సెలవులను ప్రకటించింది. జనవరి 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉంటాయని తెలిపింది. కేవలం నాలుగు రోజులు మాత్రమే పండగకు సెలవులు మంజూరు చేసింది. ఇందులో 13వ తేదీ రెండో శనివారం కాగా, 14న భోగి, 15న మకర సంక్రాంతి పండగా ఉండగా, 16వ తేదీన కనుమ పండగను జరుపుకోనున్నారు.. ఇక, 17వ తేదీ నుంచి విద్యార్థులు తిరిగి కాలేజీలకు రావాల్సిందేనని ఇంటర్మీడియట్ బోర్డు చెప్పింది.

# ఇస్రో కొత్త ప్రయోగం త్వరలో అంతరిక్షంలోకి భారత వ్యోమగాములు



(మొదటి పేజి తరువాయి) మీద రోవర్‌ను దించాలని జపాన్ భావిస్తున్నది. చిన్న చిన్న రాకెట్ ప్రయోగాలతో జాక్సా కూడా ఆసియా స్పేస్ రేసులో మందడుగు వేస్తున్నది. ఏదేమైనా ఇస్రో సృష్టించిన విప్లవం ఆసియా దేశాల్లో అంతరిక్ష పరిశోధనల మధ్య పోటీతత్వానికి దారితీసింది. పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీలు ఇస్రోకు అండదండగా మారాయి. అవే మన గగన కీర్తిని చాటుతున్నాయి.

# బంజారా చరిత్రపై పుస్తకం



(మొదటి పేజి తరువాయి) యూనివర్సిటీ తెలుగు విభాగం ప్రొఫెసర్ సూర్యాధనంజయ్, మాజీ సీటీవో డాక్టర్ ధనంజయ్ నాయక్ సంయుక్తంగా రచించిన 'బంజారా చరిత్ర'పుస్తకాన్ని ముఖ్యమంత్రి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం రచయితలు మొదటి ప్రతిని రేవంత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బంజారాల చరిత్ర ఎంతో గొప్పదని అన్నారు. బంజారాల చరిత్రను గ్రంథస్తం చేసేందుకు విశేష కృషి చేసిన రచయితలను అభినందించారు. అనంతరం రచయితలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరింపజేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేసి, రాష్టాన్ని ప్రగతిపథంలో నడుపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పెరుగుతున్న జపాన్ భూకంప మృతుల సంఖ్య

టోక్యో, జనవరి 3 (సమ సమాజం): జపాన్‌లో సంభవించిన భారీ భూకంపంలో మృతుల సంఖ్య పెరు గుతోంది. మంగళవారం ఉదయం దాకా 13గా ఉన్న మృతుల సంఖ్య సాయంత్రానికి 63కి చేరు కుంది . మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. భవ నాలు కూలడం, అగ్నిప్రమాదాల కార ణంగానే ఎక్కువ మంది చనిపోయారు. క నీగట, టొయోమ, పుకుయ్, గిఫూ నగరాల్లో భారీ సంఖ్య లో క్షతగాత్రులను గుర్తించారు. 45 వేలకు పైగా ఇళ్లకు విద్యు త్ సరఫరా నిలిచి పోయింది. పలు ప్ర ధాన రహదారులు పని చేయలేదు. ఫలితంగా సహాయక చర్య ల్లో పాలు పంచుకుంటున్న వైద్యులు, ఆర్మీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం మ ధ్యాహ్నం సమయంలో 7.6 తీవ్రతతో పెను భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. మరోవైపు, టోక్యోలోని హనెడా విమానాశ్రయంలో మంగళవారం రెండు విమానాలు ఢీకొట్టుకు న్నాయి. సపోరో నగరంలోని షిన్ చిటోస్ విమానాశ్రయం నుంచి బయల్దేరిన జపాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన జేఏఎల్ 516 విమానం హనెడా విమానాశ్రయంలో దిగుతున్న (ల్యాండింగ్) సమయంలో కోస్టు గార్డు (తీర రక్షక దళం) విమానాన్ని ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ప్యాసింజర్ విమానం మంటల్లో చిక్కుకుంది. విమానంలో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్త మైన ఎయిర్‌పోర్ట్ సిబ్బంది, అగ్నిమాపక అధికారులు సహాయక చర్యలు చేప ట్టా రు. విమానంలో ఉన్న 379మంది ప్రయాణికులు, సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో కోస్టుగార్డు విమానంలో ఉన్న అయిదుగురు సిబ్బంది దుర్మరణం పాలయ్యారు. పైలట్ ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో ప్యాసింజర్ విమానం(ఎయిర్ బస్ ఏ-350) పూర్తిగా దగ్ధమైంది. భూకంప బాధితులకు సాయం చేసేందుకు వెళ్తున్న క్రమంలో కోస్టు గార్డు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. కోస్టు గార్డు విమానం హనెడా ఎయిర్‌పోర్టు నుంచి పశ్చిమ జపాన్‌లోని నిజటాకు బయల్దేరాల్సి ఉంది. రన్ వే క్లియరెన్స్ కోసం వేచి చూస్తోంది. అంతలోనే జేఏఎల్ 516 విమానం ల్యాండ్ అయి దానిని ఢీ కొట్టింది. ప్రమాదానికి గల కారణాలపై విమానాశ్రయ అధికారులు ఆరా తీస్తున్నారు.

# ఆరు గ్యారెంటీలపై మంత్రి వాఖ్యలు



(మొదటి పేజి తరువాయి) ఇన్ చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముషీరాబాద్ సర్కిల్ బోలక్ పూర్ వార్డులోని అంజుమన్ స్కూల్ లో బుధవారం నిర్వహించిన దరఖాస్తు స్వీకరణ కౌంటర్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 10 లక్షల దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. ఇందులో ఇందిరమ్మ ఇల్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పెన్షన్, మహాలక్ష్మి, సబ్సిడీ గ్యాస్ లకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయన్నారు. కాంగ్రెస్ గెలిచి నేటితో నెల రోజులు పూర్తయ్యాయని, ఈ సమయంలోనే ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలులోకి తెస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 45 గంటల్లో మహాలక్ష్మి పథకాన్ని అమల్లోకి తెచ్చి ఇప్పటి వరకు ఆరున్నర కోట్ల మంది ఉచిత ఆర్టీసీ ప్రయాణాన్ని వినియోగించుకున్నారు అని చెప్పారు. ప్రతి ఇంటి నుండి ఒక దరఖాస్తును స్వీకరిస్తున్నామని తెలిపారు. ఆరు గ్యారెంటీ పథకాలతో పాటు ఇతర అంశాలు అయిన రేషన్ కార్డు, బస్తీ సమస్యల పై కూడా దరఖాస్తులు సమర్పించవచ్చు అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 150 వార్డులలో 600 కేంద్రాల్లో దరఖాస్తు స్వీకరణ కౌంటర్లు ఏర్పాటు చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. స్థానికులకు అవసరం మేరకు మరిన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ముషీరాబాద్ సర్కిల్ బోలక్ పూర్ వార్డు పరిధిలో పద్మశాలి కాలనీ, డి.ఎస్.నగర్, ఎస్.బి.ఐ కాలనీ, దేవుని తోట వాంబాయి క్వార్టర్స్, మండి గల్లీ వరకు దరఖాస్తులు పూర్తి చేశారు. మిగిలిన పి అండ్ టి కాలనీ, సాయిబాబా నగర్ లలో 4, 5వ తేదీల్లో ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. ప్రజా పాలనలో ఎటువంటి సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి దరఖాస్తుదారుల తో మాట్లాడారు. మహిళలకు ప్రత్యేకంగా క్యూ లైన్లు, హెల్ప్ డెస్క్ లు, త్రాగునీరు ఇతర సదుపాయాలను పరిశీలించారు. ముషీరాబాద్ సర్కిల్ లోని బోలక్ పూర్, రాంనగర్, అడిక్ మెట్, కవాడిగూడ, గాంధీ నగర్, ముషీరాబాద్ లో దరఖాస్తుల స్వీకరణ సజావుగా సాగుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, స్పెషల్ ఆఫీసర్ వెంకటరామిరెడ్డి, ముషీరాబాద్ ఎమ్మార్వో లక్ష్మి, ఆర్డీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కిలాడీ లేడీపై 17 కేసులు..



(మొదటి పేజి తరువాయి) హైదరాబాద్,జనవరి 3 (సమ సమాజం): రోడ్డుపై వెళ్లేవారిని లిఫ్ట్ అడిగి.. వారిని బెదిరించి అందినకాడికి డబ్బులు గుంజుతున్న కిలాడీ లేడీని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నయీమా సుల్తాన్ (32) అనే మహిళ వాహనదారులను లిఫ్ట్ అడిగి బ్లాక్ మెయిల్ చేస్తోంది. అర్జెంటుగా వెళ్లాలని వాహనదారులను లిఫ్ట్ అడిగి.. ఆపై అత్యాచారం పేరుతో బెదిరించి వారి నుంచి డబ్బు గుంజుతోంది. జూబ్లిహిల్స్ నుంచి కేబీఆర్ పార్క్ వరకూ లిఫ్ట్ కావాలని అడుగుతుంది. కారు ఎక్కిన తర్వాత బట్టలు చించుకుని.. నాపై అత్యాచారం చేశావంటూ సదరు డ్రైవర్ ను బెదిరిస్తుంది. తాను న్యాయవాదిని అని, అడిగినంత డబ్బు ఇవ్వకపోతే పలు సెక్షన్ల కింద కేసులు పెడతానని బెదిరింపులకు పాల్పడుతోంది. మహిళ బెదిరింపులతో.. ఒక డ్రైవర్ జూబ్లిహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఆమె ఆగడాలు వెలుగుచూశాయి. నయీమా సుల్తాన్ పై ఐపీసీ 389 సెక్షన్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. ఆమెపై హైదరాబాద్ లోని పలు స్టేషన్లలో ఇప్పటికే 17 కేసులున్నట్లు గుర్తించారు. నిందితురాలి వద్ద వందలాది కేసులకు సంబంధించిన కేస్ స్టడీస్ వివరాలు లభించాయి. వాటి ఆధారంగానే ఏ కేసులో ఎలాంటి శిక్ష పడుతుందో తెలుసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

# గృహలక్ష్మి పథకం రద్దు




(మొదటి పేజి తరువాయి) ఇందిరమ్మ ఇళ్ల పేరిట జాగా వున్న పేదలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం, ఇళ్లు లేనివారికి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు నిర్ణయించింది. ఈ క్రమంలో గతంలో వున్న గృహలక్ష్మి పథకాన్ని ఉపంసహరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆయా శాఖలకు ఆదేశాలిచ్చింది.

# తెలంగాణలో 26మంది ఐఏఎస్‌ల బదిలీ



(మొదటి పేజి తరువాయి) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా మహేశ్ దత్ ఎక్కాను నియమించింది. ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీగా అహ్మద్ నదీమ్, సాగునీటిశాఖ క్యాదర్శిగా రాహుల్ బొజ్జా బదిలీ చేసింది. మొన్నటి వరకు సీఎంఓ ముఖ్య కార్యదర్శిగా ఉన్న స్మితా సబర్వాల్‌ను ఫైనాన్స్ కమిషన్ సభ్య కార్యదర్శిగా నియమించింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్, ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ బాధ్యతలను డీ దివ్యకు అప్పగించింది. నల్గొండ కలెక్టర్‌గా హరిచందన దాసరిని బదిలీ చేసింది. వెయిటింగ్‌లో ఉన్న భారతీ హాళలికెరికి ఆర్కియాలజీ బాధ్యతలను అప్పగించింది. రంగారెడ్డి కలెక్టర్‌గా కే శశాంక, మహబూబాబాద్ కలెక్టర్‌గా అద్వైత్ కుమార్‌ను బదిలీ చేసింది. టీఎస్ డైరీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఫెడరేషన్ ఎండీగా చిట్టెం లక్ష్మి, కార్మికశాఖ డైరెక్టర్‌గా క్రిష్ణ ఆదిత్య, మైనారిటీ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా ఆయేషా మస్రత్ ఖానమ్‌ను నియమించింది. సీఎంవో కార్యాలయ జాయింట్ సెక్రెటరీగా సంగీత సత్యనారాయణ, సంగారెడ్డి కలెక్టర్‌గా వల్లూరి క్రాంతి, జోగులాంబ కలెక్టర్‌గా బీఎం సంతోష్, హైదరాబాద్ స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా కధీరవన్, బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శిగా బీ వెంకటేశం, పీసీబీ సభ్య కార్యదర్శిగా జ్యోతి బుద్దా ప్రకాశ్, ఆయూష్ డైరెక్టర్‌గా ఎం ప్రశాంతి, ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ ముఖ్య కార్యదర్శిగా డీ కృష్ణ భాస్కర్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీగా ఆర్‌వీ కర్ణన్, జీఏడీ కార్యదర్శిగా రఘునందన్‌రావు, పంచాయతీ కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# రెజ్లింగ్ సంక్షోభం కొత్త మలుపు



(మొదటి పేజి తరువాయి) వారంతా ప్రముఖ రెజ్లర్లు అయిన వినేష్ ఫోగట్, బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్‌లకు వ్యతిరేకంగా గళం విప్పారు. వారికి వ్యతిరేకంగా నిరసన చేయడంతో రెజ్లింగ్ సంక్షోభం కొత్త టర్న్ తీసుకుంది. బుధవారం వందలాది మంది రెజ్లర్లు ఉత్తర్ ప్రదేశ్, హర్యానా, ఢిల్లీలోని వివిధ ప్రాంతాల నుంచి జంతర్ మంతర్ చేరుకున్నారు. వీరిలో దాదాపు 300 మంది ఛ్రపౌలీ, బాగ్‌పట్ లోని ఆర్యసమాజ్ అఖారా నుంచి వచ్చారు. మరికొందరు నరేలాలోని వీరేందర్ సింగ్ రెజ్లింగ్ అకాడమీ నుంచి వచ్చారు. హఠాత్తుగా ఇంత మంది రావడంతో పోలీసులు వారిని అదుపు చేసేందుకు కష్టపడ్డారు. వీరంతా సాక్షి మాలిక్, బజరంగ్ పూనియా, వినేష్ ఫోగట్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రం సస్పెండ్ చేసిన డబ్ల్యూఎఫ్ఐని పునరుద్ధరించాలని జూనియర్ రెజ్లర్ల కోరారు.కేంద్రానికి, రెజ్లింగ్ ఫెడరేషన్‌కి వ్యతిరేకంగా సాక్షి, బజరంగ్, వినేష్ గళం విప్పిన ఇదే చోట ప్రస్తుతం వారు వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. గతేడాది నుంచి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడనే ఆరోపణలతో ముగ్గురు ఏస్ రెజ్లర్లు ఆందోళన నిర్వహించారు. బ్రిజ్ భూషణ్‌ని తొలగించాలని డిమాండ్ చేశారు. అయితే ఇటీవల బ్రిజ్ భూషన్ స్థానంలో ఆయన సన్నిహితుడు సంజయ్ సింగ్ ఫెడరేషన్ ఎన్నికల్లో గెలుపొంది, డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌గా ఎన్నికయ్యారు. అయితే ఈ ఎన్నికలను కూడా ముగ్గురు రెజ్లర్లు తప్పుపట్టారు. బజరంగ్ పూనియా తనకు ఇచ్చి పద్మ శ్రీని కేంద్రానికి వాపస్ ఇస్తానని ప్రకటించడంతో పాటు సాక్షి మాలిక్ రెజ్లింగ్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ, కొత్తగా ఎన్నికైన డబ్ల్యూఎఫ్ఐ కార్యవర్గన్నా సస్పెండ్ చేసింది. నిబంధనలు, నియమాలకు వ్యతిరేకంగా ప్రవర్తించారని చెబుతూ సస్పెన్షన్ విధించింది. ఇండియన్ ఒలింపిక్స్ ఆర్గనైజేషన్‌కి రెజ్లింగ్ బాధ్యతలు నిర్వహించాలని కోరింది.

# రాజధాని లేకుండా ముగిస్తున్న ఐదేళ్లు

## ఇదే అంశంపై విపక్ష టిడిపి,జనసేనల పోరు■రానున్న ఎన్నికల్లో హాట్ టాపిక్‌గా రాజధాని అంశం

అమరావతి, జనవరి 3 (సమ సమాజం) ఎన్నికల నగారా ఇక మోగనుంది. త్వరలోనే షెడ్యూల్ కూడా వెలువడ నుంది. ఇప్పటికే ఎపిలో ఎన్నికల వేడి రాజుకుంది. అధికార వైసిపి కసరత్తులు మొదలు పెట్టింది. విపక్ష టిడిపి,జనసేనలు కూడా ఉమ్మడి కార్యాచరణకు రంగం సిద్దం చేశాయి. జగన్ ఏకంగా తమ అభ్యర్థులను మార్చేలా ముందుకు సాగుతున్నారు. మొత్తంగా రాజకీయ వేడి అంతా ఇంతా అనకుండా సాగుతోంది. గత ఐదేళ్ల జగన్ పాలనలో ప్రజలకు పందేరాలు తప్ప కనీసం రోడ్లను కూడా పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. అలాగే రాజధాని అన్నది లేకుండా ఈ కాలం గడిచింది. ఇక ఈ రెండునెల్లలో ఏం చేసినా చెల్లుబాటు కాదు. అమరావతిని అడ్రస్ లేకుండా చేయడం ద్వారా జగన్ తన పంతాన్ని నెరవేర్చారు. రాజధాని రగడను కమ్మ,రెడ్ల మధ్య పోరాటంగా చిత్రీకరించడంతో ఇప్పుడు రాజధాని లేని ఎపికి పెట్టుబడులు రావడం అన్నది అనుమానంగా మారింది. దావోస్ లాంటి సదస్సుల్లో పాల్గొని ఎపిని మరింతగా ముందుకు తీసుకుని వెళ్లాల్సిన సమయంలో ప్రజలు చేస్తున్న ఆందోళనలను కేవలం చంద్రబాబు, ఆయన అనుచరులు సేకరించిన భూ సమస్యగా చిత్రీకరించి ముందుకు సాగడంతో సమస్య మరింత జటిలం అయ్యింది. కోర్టు తీర్పులను ఖ్యాతరు చేయకుండా సాగారు. ఈ అంశాన్ని కూడా తెలుగుదేశం-జనసేన కూటమి తమ ప్రచారాంలో ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది. జనవరి 5 నుంచి టిడిపి ఎన్నికల సభలకు కార్యాచరణ ప్రకటించింది. సిఎం వైఎస్ జగన్,ఆయన మంత్రులు కూడా దూరాలోచన లేకుండా రాజధానిపై తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని వస్తున్న విమర్శలను ఖాతరు చేయడం లేదు. అన్ని ప్రాంతాలను అభివృద్ది చేయడం వేరు.. రాజధానిని నిర్మించుకోవడం వేరన్న కనీస విషయ పరిజ్ఞానం లేకుండా ఐదేళ్లు కొనసాగించారు. అసలు రాజధాని అంటూ ఉంటే ఆర్థికంగా దాని చుట్టూ కార్యక్రమాలు బలపడుతాయి. ఈ దశలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా చోద్యం చూస్తోంది. ఐదేళ్లుగా ఆందోళనలు సాగినా..ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాత్రం తన పట్టు వీడలేదు. యధావిధిగానే మంత్రులంతా వివాదాస్పద ప్రకటనలు చేసారు. అమరావతిని ఓ కుల సమస్యగా తీసుకుని ముందుకు సాగడం ఆయన సంకుచిత దృష్టికి నిదర్శనంగా గుర్తించాలి. అనేక పథకాలతో ప్రజలకు డబ్బులు పందేరం చేస్తూ ఆదాయాలపై దృష్టి పెట్టక పోవడం వల్ల రాష్ట్రం దివాళా తీయడం ఖాయంగా కనిపిస్తోంది. తెలంగాణలోనూ మేడిపండు చందంగా కనిపించింది. ఇప్పుడు అప్పులకుప్పలు కనిపిస్తున్నాయి. జగన్ అధికారం చేపట్టిన నాటినుంచే ..రాష్ట్రానికి అధికారిక రాజధాని ఏదో చెప్పకుండా మూడు ప్రాంతాల అభివృద్ధి అంటూ వివాదాలకు తెరతీసారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రాజధాని మూడు ప్రాంతాల్లో ఉండాల్సిన అవసరం లేదు. సహజ సిద్ధంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ పట్టణాన్ని ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా చెబుతున్న ప్రభుత్వం ముమ్ముందు విశాఖనే ప్రధాన రాజధానిగా ప్రకటించి.. సాగివున్నా సమస్య వచ్చేది కాదు. ఇప్పటికే వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మాణాలు పూర్తిచేసిన అమరావతి పేరుకు మాత్రమే రాజధానిగా ఉంటుందని స్పష్టం అయ్యింది. రాజధాని మార్పు విషయంలో వివాదం ముసురుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మౌనం వహించింది. జగన్మోహన్‌రెడ్డి పూర్తిగా అప్రతిష్ఠపాలయ్యేలా చూడాలని బిజెపి మౌనం వహిస్తుందా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సేవలరంగం విస్తరించడంతో జాతీయ అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలన్నీ హైదరాబాద్ లో కొలువుదీరాయి. ఆయా కంపెనీలకు హైదరాబాద్‌లో వందల ఎకరాలను కేటాయించడంతో అవి మరింతగా విస్తరణ పథకాలతో ముందుకు సాగుతున్నాయి. దీంతో హైదరాబాద్ ఆదాయం మరింతగా పెరగడంతో తెలంగాణ ప్రభుత్వానికి ఆదాయంలో ఢోకా లేకుండా పోయింది. అమరావతిని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా చంద్రబాబు ప్రభుత్వం మార్చివేసిందని ఇప్పుడు విమర్శిస్తున్నవారు గతంలోనూ, ఇప్పుడూ హైదరాబాద్‌లో ఏమి జరుగుతున్నదో ఒకసారి గుర్తుచేసుకోవాలి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్‌లోని భూములనే పెట్టుబడిగా వాడారు. అంతేగానీ ఇతర ప్రాంతాల నుంచి ఆదాయాన్ని తెచ్చి హైదరాబాద్ అభివృద్ధికి ఖర్చు చేయలేదు. సరికదా ఇక్కడ రియల్ వ్యాపారం విస్తరించడంతో కూడా ఆదాయం భారీగాపెరిగింది. ఏ నగరమైనా అభివృద్ధి చెందినప్పుడు భూముల ధరలు పెరగడం సహజం. అలాంటప్పుడు ప్రభుత్వ భూముల ధర కూడా పెరుగుతుంది. ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అలా హైదరాబాద్‌లో భూములు కొనుగోలు చేసినవారు కూడా లాభపడ్డారు. రాజధానికి 33 వేల ఎకరాల భూమి ఎందుకు అని ప్రశ్నించినవారు, అమరావతిని తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేసుకుంటే సరిపోతుంది. అమరావతి నిర్మాణానికి లక్ష కోట్లు కావాలి.. ప్రభుత్వం వద్ద అంత డబ్బు లేదని అన్నవారు..ఇప్పుడు ప్రజలకు సమాధానం చెప్పుకోవాలి. పాలకుల సంకుచిత ధోరణి ఎపికి శాపంగా పరిణమించింది. కేంద్రంలోని బిజెపి అనుసరించిన చేతకాని తనం కూడా తోడయ్యింది.

# ఇస్రో గగన విజయాలు అద్భుతం !

అంతరిక్షంలో విజయాలు అంత సులువుగా రావు. ఎంతో కఠోర పరిశ్రమ చేసినా ప్రకృతి ఒక్కోసారి వికటిస్తుంది. అందుకు చంద్రయాన్ -2 లో ఎదురైన సమస్యలే నిదర్శనం. కానీ తరవాత ప్రజ్ఞాన్ రోవర్ విజయవంతంగా చంద్రుడిపై కాలుమోపింది. గత ఏడాది చరిత్రాత్మక చంద్రయానంతో అద్భుతాన్ని సృష్టించిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో, మరో అద్భుత విజయంతో ఈ కొత్త సంవత్సరాన్ని ప్రారంభించింది. కృష్ణబిలాల రహస్యాన్ని ఛేదించే క్రమంలో చేసిన ప్రయోగంతో కొత్త ఏడాదిని ఇస్రో ఘనంగా ప్రారంభించింది. అయితే ప్రతికూల పరిస్థితులు ఎప్పుడూ పొంచి ఉంటాయి. అంతరిక్షంలో మనం భూమ్మీద లాగా దూసుకుని పోలేం. అంచనాలు తలకిందులు అవుతాయి. ఒక్కోసారి విజయాలు వరిస్తాయి. ఇవన్నీ కూడా నిరంతర పరిశోధనల్లో భాగమే తప్ప ఇందులో విజయాలు, వైఫల్యాల లెక్కలకు తావు లేదు. ఇస్రో శాస్త్రవేత్తలు నిరంతరపరిశోధకులు. వారి పరిశోధనలకు ప్రతి ఒక్కరు తలవంచి అభినందించాల్సిందే. చంద్రయాన్ విజయం తరవాత ఇస్రో చేస్తున్న కృషి అద్భుతంగా ఉంది. కాస్మిక్ ఎక్స్‌రేలను అధ్యయనం చేయడానికి భారతదేశం ఇలా అంతరిక్షంలోనే ఒక అబ్జర్వేటరీని ఏర్పాటు చేసుకుంది. అమెరికా మాత్రమే ఈ విషయంలో మనకంటే ముందున్నది..ఇప్పుడు ఇస్రో చేపట్టిన పరిశోధన తో మనం కూడా సగర్వంగా ముందుకు సాగే అవకాశం వచ్చింది. కృష్ణబిలాలు, న్యూట్రాన్ స్టార్ల గురించి ఎంతోకొంత అవగాహన ఉన్నా, వాటి పుట్టుపూర్వోత్తరాల విషయంలో మనిషి నిరంతర అన్వేషణ సాగుతూనే ఉన్నది. చివరకు కాంతిని సైతం దిగమింగే బలమైన అయస్కాంత శక్తితో, లక్షలాది సూర్యుల ద్రవ్యరాశితో అంతులేని ఆకాశంలో అంతుచిక్కని బ్రహ్మ రహస్యమే కృష్ణబిలం. వాటినుంచి వెలువడే శక్తిమంతమైన ఎక్స్‌రేల ప్రవర్తనను సక్రమంగా విశ్లేషించినప్పుడు ఆవిర్భావక్రమాన్ని కొంతమేరకు అర్థం చేసుకోగలం. దీని గుట్టును కనుక్కునే లక్ష్యంతో ఇస్రో వేసిన అడుగు అద్భుతం అని చెప్పక తప్పదు. ఎక్స్‌రే పొలారిమీటర్ సాటిలైట్ ఎక్స్‌పోశాట్ మన ఖగోళ అధ్యయనంలో ఒక అద్భుత పురోగతి. తన ఐదేళ్ళ జీవితకాలాన్ని ఇది ప్రధానంగా కృష్ణబిలా లను అధ్యయనం చేయడానికి వినియోగిస్తుంది. ఎక్స్‌రే ఫోటాన్లు, వాటి పోలరైజేషన్ తెలుసు కోవడం ద్వారా కృష్ణబిలాలు, న్యూట్రాన్ స్టార్ల రేడియేషన్ గుట్టు విప్పుతుంది. అంతరిక్షంనుంచి వెలువడే యాభై రకాల కాంతిపుంజాలను అధ్యయనం చేయడానికి అంతరిక్షంలోనే ఓ అబ్జర్వేటరీని నెలకొల్పుకోవడం ఇస్రో చేస్తున్న సాహస పరిశోధనగా గుర్తించాలి. ఇస్రో గతేడాది చంద్రయాన్ విజయం తక్కువేమీ కాదు. అత్యంత శక్తిమంతమైన బాహుబలి రాకెట్‌ను, సాంకేతికంగా అత్యున్నతమైన ఉపగ్రహాలను అభివృద్ధి చేసుకుంది. ఎక్స్‌పోశాట్ మాదిరిగానే, ఇటీవలి ఆదిత్య ఎల్1 కూడా స్పేస్ అబ్జర్వేటరీయే. జనవరి 6న ఆదిత్య ఎల్1 తన చిట్టచివరి విన్యాసాన్ని ముగించుకొని గమ్యాన్ని చేరబోతున్నది.ఆగస్టులో చంద్రయానం జరగ్గానే, సెప్టెంబర్ లోనే ఆదిత్యకు అంకురార్పణ చేయడం ఓ సాహసం. అత్యంత కఠినమైన చంద్రుడి దక్షిణ ధ్రువంలో సాఫ్ట్‌ల్యాండింగ్ విజయవంతం చేయడం ఇస్రో కీర్తికిరీటంలో ఓ కలికితురాయి. చంద్రుడిమీదకు సున్నితంగా వాలే ఆ 'ఫిఫ్టీన్ మినిట్స్ ఆఫ్ టెర్రర్'లో ఎదురయ్యే అవాంతరాలను ల్యాండర్ మాడ్యూల్ స్వయంగా అధిగమించే రీతిలో తయారు చేయడం ఇస్రో దూరదృష్టికి నిదర్శనం. ప్రయాణమార్గంలో అడ్డువచ్చిన అగాధాన్ని తనకుతానుగా తప్పించుకొని తిరిగి తనపని తాను చేసుకుపోయిన రోవర్ ప్రజ్ఞాన్ కూడా ఓ అద్భుతమే. చంద్రయాన్, ఆదిత్య మాత్రమే కాదు, గత ఏడాది రీయూజబుల్ లాంచ్ వెహికల్‌ను ఇస్రో విజయవంతంగా పరీక్షించింది. మానవ సహిత గగనయానికి అత్యంత కీలకమైన క్ర్యూ ఎస్కేప్ మోడల్ పరీక్షను కూడా అది దిగ్విజయం చేసుకుంది. భారత అంతరిక్ష చరిత్రలో 2023 ఇస్రోకు విజయవంతమైన ఏడాది. చేతిలో 14ప్రాజెక్టులతో, మరిన్ని ఉన్నతమైన లక్ష్యాలతో ఈ కొత్త సంవత్సరంలో అది మరింత దూసుకుపోయేలా ప్రణాళికలు చేస్తోంది. భారతీయుల ఆకాంక్షలకు, విజ్ఞాన సామర్థ్యానికి, సాంకేతిక పరిణతికి నిదర్శనమైన ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుడి ఉపరితలంపై కాలుమోపటం ద్వారా.. మనదేశ సత్తాను మరోమారు యావత్ ప్రపంచానికి చాటిచెప్పింది. అంతరిక్ష పరిశోధనల చరిత్రలోనే తొలిసారిగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై రోవర్ దిగ్విజయంగా అడుగులు వేయడమన్నది ఇస్రో ఘన విజయానికి సూచిక. ఇప్పటికే రోదసి రంగంలో అనేక రికార్డులను నెలకొల్పింది. భారతీయుల ప్రతిభకు, చిత్తశుద్ధికి చంద్రయాన్ ఒక నిదర్శనంగా నిలుస్తుంనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికే మన శాస్త్రవేత్తలు గొప్ప విజయం సాధించారు. మన దేశాన్ని గర్వపడేలా చేశారు. ఈ ప్రపంచానికి, సైన్స్‌కు, సమస్త మానవాళికి ఎంతో సేవ చేశారు. మన ప్రయాణం మరింత ధృడంగా కొనసాగించే సత్తా ఇస్రో శాస్త్రవేత్తలకు అందాలని భారతావని కోరుకుంటోంది. ఇలా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో కృష్ణ బిలాల రహస్యం కోసం చేస్తున్న ప్రయత్నంలో భాగంగా మరో అరుదైన మైలురాయి సాధించి, భారత ఘనతను గగనాన నిలిపింది. అంతరిక్ష ప్రయోగాల వేదిక శ్రీహరికోటలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో చరిత్ర సృష్టించింది. రోదసి రంగంలో అగ్రగాములుగా ఉన్న అమెరికా, రష్యాల సరసన భారత్ చేరింది. ఇప్పటికే చంద్రయాన్ యాత్ర చేపట్టింది. అంగారక కక్షలోకి ఉపగ్రహాన్ని ప్రవేశ పెట్టింది. ఇలా ఎన్నో విజయాలతో దూసుకుని పోతోంది. ఈ దశలో ఇస్రో పరిశోధనలకు మరింత ఆర్థిక సహకారం ఇవ్వాల్సి ఉంది. ఈ విజయం ఒక్క రోజులో సాధ్యం కాలేదు. దీని వెనుక దశాబ్దాల తరబడి నిరంత రాయంగా సాగిన శాస్త్రవేత్తల కృషి, కఠోర పట్టుదల ఉంది. అంతరిక్ష శక్తిగా ఎదగకుండా భారత్‌ను అడ్డుకోవాలన్న అంతర్జాతీయ రాజకీయాలు ఉన్నాయి. స్వావలంబన దిశలో ఇస్రో చేస్తున్న కృషికి నూతనంగా సాధించిన ఈ సామర్థ్యం ఎంతగానో ఉపయోగ పడనుంది. అన్ని ఆటంకాలను, అవరోధాలను ఎదుర్కొని సాధించిన విజయం కాబట్టే ఇది చారిత్రాత్మకం. ప్రతి భారతీయుడు గర్వించదగిన విజయమిది. ఇంతటి ఘన విజయాన్ని దేశానికి అందించిన శాస్త్రవేత్తలకు అభినందించాల్సిందే. ఎన్నిసార్లు... ఎన్ని రోజులయినా మన వాడి తగ్గగదని రుజువు చేశారు. ఆర్యభట్టుడు చూపిన మార్గంలో మన అంతరిక్ష పరిశోధనలు మరింతగా ముందుకు సాగాలని గుర్తు చేసేలా ప్రయోగాలు సఫలం అవుతున్న తీరు మన వాసిని చాటుతున్నాయి. భవిష్యత్ ఖగోళంలో ఇక భారత్ మాత్రమే చరిత్ర సృష్టించగలదని నిరూపించబోతున్నారు.

# అమరావతి కేసుల విచారణ వాయిదా



అమరావతి,జనవరి 3 (సమ సమాజం) : ఏపీ రాజధాని అమరావతికి సంబంధించిన కేసుల విచారణను సుప్రీంకోర్టు ఏప్రిల్‌కు వాయిదా వేసింది. ఆ నెలలోని నాన్ మిస్‌లేనియస్ డేలో వాదనలు వింటామని న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం స్పష్టం చేసింది. ఏపీ రాజధానిగా అమరావతినే కొనసాగించాలంటూ రాష్ట్ర హైకోర్టు 2022 మార్చిలో తీర్పు వెలువరించింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం చేయాల్సిన పనులపై కాలపరిమితి విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై పలుమార్లు వాదనలు జరిగాయి. ఈ క్రమంలోనే ఏపీ హైకోర్టు విధించిన కొన్ని గడువులపై జస్టిస్ కేఎల్ జోసెఫ్ నేతృత్వంలోని ధర్మాసనం స్టే విధించింది. అయితే అమరావతే రాజధాని అనే విషయంపై స్టే ఇవ్వలేదు. తాజాగా బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ముందు కేసు విచారణకు వచ్చింది. సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గీ ఏపీ సర్కార్ తరఫున వాదనలు వినిపించారు. మూడు రాజధానుల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుందన్నారు. దానిపై తీర్పు నిరర్థకమని ఆయన వాదించారు. ఆ వాదనలను రాజధాని ప్రాంత రైతుల తరఫున సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ తోసిపుచ్చారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు నిరర్థకమేమీ కాదన్నారు. ఒరిజినల్ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఎలా అభివృద్ధి చేయాలో చెబుతూ ఉన్నత న్యాయస్థానం కాలపరిమితి విధించిందని ధర్మాసనం దృష్టికి దేవదత్ కామత్ తీసుకొచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా.. తదుపరి విచారణను ఏప్రిల్‌లో చేపడతామన్నారు. అంతకంటే ముందే విచారించాలని.. లేదంటే ఏప్రిల్‌లో విచారించే వారాన్ని అయినా చెప్పాలని ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది కోరారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి తోసిపుచ్చారు.

# ఆర్యభట్టతో ఆకాశంలో మొదలైన ప్రస్థానం



## ఎత్తిన తలదించకుండా ముందుకు సాగుతున్న వైనం

జనవరి 3 (సమ సమాజం): ఆర్యభట్టతో ఇస్రో తన ప్రయోగాల పరంపరను ప్రారంభించింది మొదలు ఇప్పటి వరకు ఎన్నో ఒడిదుడుకులను, ఆర్థిక ఇబ్బందునలు ఎదుర్కొన్నా, ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. ఎత్తిన తలదించలేదు. 1962లో కేరళలోని తుంబ రాకెట్ ప్రయోగకేంద్రంతో అంతరిక్ష పరిశోధనలో తొలి అడుగుపడింది మొదలు ఇస్రో కేంద్రంగా సాగుతున్న పరిశోధనలు, ప్రయోగాలే ఇందుకు నిదర్శనం.

ముందుగా, వాతావరణ పరిస్థితుల అధ్యయనానికి ఉపకరించే మూడు అడుగుల చిన్న సౌండ్ రాకెట్లను (ఆర్‌హెచ్-75) అంతరిక్షానికి పంపింది. 1975లో రష్యా సాయంతో మన తొలి ఉపగ్రహం ఆర్యభట్టను చేరవేసింది. అనంతరం 1979లో, శ్రీహరికోట కేంద్రం నుంచి ఎస్ఎల్‌వీ రాకెట్‌ను నింగి మీదికి సంధించింది. ప్రయత్నం విఫలమైనా, ఆ అనుభవం నుంచి నేర్చుకున్న పాఠాలతో... 1980లో ఎస్ఎల్‌వీ రాకెట్ (రోహిణి)ను విజయవంతంగా గగనానికి చేర్చింది. 1979-81 మధ్యలో భాస్కర ప్రయోగం మరో ముందడుగు. సామాన్యులకు శాస్త్ర, సాంకేతిక ఫలితాలను చేరువ చేసేందుకు సమాచార ఉపగ్రహ ప్రయోగాలనూ చేపట్టింది. 1975-76లో 'శాటిలైట్ ఇన్‌స్ట్రుమెంట్ టెలివిజన్ ఎక్స్‌పరిమెంట్' ద్వారా... సమాచార ఉపగ్రహాన్ని విద్యా బోధన సాధనంగా ఎలా ఉపయోగించుకోవచ్చో కూడా నిరూపించింది. 1979లో ఆపిల్ సమాచార ఉపగ్రహాన్ని పంపింది. 1982-90 మధ్యకాలంలో విదేశీ రాకెట్ల సాయంతో ఇన్సాట్-1ను నింగికి చేరవేసింది. ఇది ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాలను అనుసంధానం చేసి వినోద,

విజ్ఞానాలతోపాటు విద్యావ్యాప్తికి దోహదపడింది. ఆతర్వాత చంద్రయాన్, మంగళ్‌యాన్ తదితర ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకూ శ్రీకారం చుట్టింది. అందులోనూ గత ఏడాది...మొతం తొమ్మిది ప్రయోగాలు చేపట్టింది. అన్నీ విజయవంతం అయ్యాయి. ఒక రాకెట్ ద్వారా వేర్వేరు కక్ష్యల్లో ఉపగ్రహాలు ప్రవేశపెట్టడం. పీఎస్‌ఎల్‌వీ-సి36 పీఎస్4లో (నాల్గో దశలో) రిమోట్ కంట్రోల్ సిస్టమ్‌తో ద్రవ ఇంధనం

నింపడం, నావిక్ వ్యవస్థ ద్వారా రాకెట్ పర్యవేక్షణ, ప్రతికూల వాతావరణంలోనూ రాకెట్ అనుసంధానం, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఉపగ్రహంలోని పెలోడ్స్‌ను మనమే అభివృద్ధి చేసుకోవడం... ఇలా అన్నీ విజయాలే.

# ఇజ్రాయెల్ దాడిలో హమాస్ అగ్ర నేత అరౌరీ మృతి



బీరుట్, జనవరి 3 (సమ సమాజం): లెబనాన్ రాజధాని బీరుట్ శివారు ప్రాంతంలో ఇజ్రాయెల్ జరిపిన డ్రోన్ దాడిలో హమాస్ అగ్ర నేత, మిలిటెంట్ విభాగం వ్యవస్థాపకుల్లో ఒకడైన సలేహ్ అరౌరీ మృతి చెందాడు. డ్రోన్ దాడితో చోటుచేసుకున్న పేలుడులో ఆరుగురు మృతి చెందినట్లు లెబనాన్ అధికార వార్తా సంస్థ వెల్లడించింది. అందులో అరౌరీ ఉన్నట్లు తెలిపింది. అయితే ఈ ఘటనపై స్పందించేం దుకు ఇజ్రాయెల్ నిరాకరించింది. హెజ్‌బొల్లాకు గట్టి పట్టున్న ప్రాంతమైన దక్షిణ బీరుట్ శివారులో ఈ ఘటన జరగడం కలకలం రేపింది. అరౌరీ హత్య నేపథ్యంలో యుద్ధం మరింత తీవ్రమయ్యే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనపై లెబనాన్ ఆపద్ధర్మ ప్రధాని నజీబ్ మికాతీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇజ్రాయెల్ తమను యుద్ధంలోకి లాగాలని చూస్తోందని మండిపడ్డారు.

# టిడిపిలోకి జోరుగా చేరికలు

## దాడి వీరభద్రరావు, సి. రామచంద్రయ్యల చేరిక

## మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకానాథరెడ్డి కూడా చేరిక



అమరావతి, జనవరి 3 (సమ సమాజం): మంగళగిరిలోని టీడీపీ ఆఫీసు వద్ద సందడి వాతావరణం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి నేతలు టీడీపీలో చేరేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలువురు నేతలు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. బుధవారం వైసీపీ కీలక నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సొంత బావమరిది టీడీపీలో చేరారు. ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకానాథరెడ్డి ఇవాళ టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో సైకిలెక్కారు.చంద్రబాబు పసుపు కండువా కప్పి ద్వారకా నాథ రెడ్డిని సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. ద్వారకానాథరెడ్డి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి స్వయనా బావమరిది. ఇక ద్వారకానాథరెడ్డితో పాటు అన్న సురేంద్రనాథరెడ్డి, అక్క హరెమ్మ (తారకరత్న అత్త) టీడీపీ కండువా కప్పుకున్నారు. విజయసాయిరెడ్డి, ఆయన భార్య మినహా కుటుంబసభ్యులందరూ ఒకే సారి టీడీపీలో చేరారు. విజయసాయిరెడ్డి, ఆయన భార్య మినహా కుటుంబసభ్యులందరం టీడీపీలో చేరామన్నారు. విజయసాయిరెడ్డి దంపతులు కూడా వైసీపీ వీడే పరిస్థితి రావొచ్చేమో అని వ్యాఖ్యానిం చారు. విజయసాయిని టీడీపీలోకి ఆహ్వానించే హక్కు తనకుందని, తనకు వైసీపీ టికెట్ ఇస్తానని పలుమార్లు మాట తప్పారని ద్వారకానాథరెడ్డి బయటపెట్టారు. తనకు కనీసం నామినేటెడ్ పదవి ఇస్తానని వైసీపీలో మోసగించారని ద్వారకానాథరెడ్డి తెలిపారు. రాయచోటి ఎమ్మెల్యే, వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, జగన్ పాలన మొత్తం అవినీతిమయమైందని ఆరోపించారు.వైఎస్సార్ పాలనకు, జగన్ పాలనకు పొంతనే లేదని, ఎన్నికల కోసం వాడుకుని వదిలేయడం జగన్ నైజమని విమర్శించారు. సీఎంవోలో విజయసాయి, మరో నలుగురు కలెక్షన్ ఏజెంట్లు ఉన్నారని, విజయసాయి, సజ్జల, మిధున్ రెడ్డి వంటి కలెక్షన్ ఏజెంట్లకే జగన్ సీఎంవోకి అనుమతి ఇస్తున్నారని ద్వారకానాథరెడ్డి ఆరోపించారు. వైసీపీకి మెజార్టీ వచ్చే రాయచోటిలోనే గెలిచే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ఇక వైసీపీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య కూడా చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన పార్టీలో చేరుతారని ఎవరూ అనుకోలేదు. కడప జిల్లాలో బలమైన బలిజ నేతగా ఉన్న ఆయన వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరేందుకు వచ్చారు టీడీపీలో చేరిన అనంతరం సిట్టింగ్ ఎమ్మెల్సీ రామచంద్రయ్య మాట్లాడుతూ.. మళ్లీ కోలుకోలేని విధంగా ఏపీని జగన్ అప్పులపాలు చేశారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై జగన్‌కు చెప్పినా వినే పరిస్థితి లేదన్నారు. తనలాగే వైసీపీలో ఎంతోమంది ఉన్నారని, సమయానుకూలంగా బయటకు వస్తారని అన్నారు. రాష్ట్రం మరింత దిగజారుతుందనే ఉద్దేశంతో టీడీపీలో చేరుతున్నానని, కఠిన సమయంలో పొరపాటు చేస్తే రాష్ట్రం ఇబ్బందుల్లోకి వెళ్తుందన్నారు. వ్యవస్థలను పునరుద్దరించి దారికి తేవాలంటే చంద్రబాబుకే సాధ్యమని, రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం చాలా అవసరమన్నారు. రాష్ట్ర ప్రజలకు మరో మార్గం లేదని, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా చంద్రబాబును సీఎం చేసి తీరాలని పిలుపునిచ్చారు. చంద్రబాబును సీఎం చేసేందుకు అందరూ కష్టపడాలని, చంద్రబాబు నాయకత్వాన్ని అందరూ బలపరచాలని సూచించారు. టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకు అందరూ కలిసి పనిచేయాలన్నారు. వైసీపీకి మంగళవారమే రాజీనామా చేసిన దాడి వీరభద్రరావు కుటుంబంతో సహా టీడీపీ కండువా కప్పుకున్నారు. అలాగే వివిధ నియోజకవర్గాలకు చెందిన వైసీపీ ముఖ్యనేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. అనంతపురం, చీరాల, బాపట్ల, పార్వతీపురంకు చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీ గూటికి చేరారు. ఒకేసారి భారీ సంఖ్యలో వైసీపీకి చెందిన నేతలు టీడీపీలో చేరగా.. విజయసాయిరెడ్డి సొంత బంధువులే చేరడం విశేషంగా మారింది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైసీపీ శ్రేణులకు ఈ పరిణామం మింగుడు పడటం లేదు. చేరికల సందర్భంగా టీడీపీ ఆఫీస్ కిక్కిరిసిపోయింది.

# ఏపీ పశుసంవర్ధక సహాయకుల పోస్టుల రాత పరీక్ష ఆన్సర్ 'కీ' విడుదల

అమరావతి, జనవరి 3 (సమ సమాజం): ఆంధ్రప్రదేశ్‌లో పశుసంవర్ధక సహాయకుల పోస్టుల నియామక పరీక్ష ప్రాథమిక కీ విడుదలైంది. కీపై అభ్యంతరాలను జనవరి 3వ తేదీలోగా తెలియజేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ తెల్పింది. త్వరలో ఫలితాలు వెల్లడిస్తామని, ఫలితాలతో పాటు తుది కీ కూడా వెల్లడి చేస్తామని పేర్కొంది. పశుసంవర్ధక సహాయకుల పోస్టులకు డిసెంబర్ 31న పరీక్ష జరిగిన విషయం తెలిసిందే. పశుసంవర్ధక సబార్డినేట్ సర్వీసులో రెగ్యులర్ ప్రాతిపదికన మొత్తం 1,896 యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ (ఏహెచ్ఏ) పోస్టులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. రాత పరీక్షలో ప్రతిభకనబరచిన అభ్యర్థులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. రాత పరీక్ష, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు. గోపాలమిత్ర/ గోపాలమిత్ర సూపర్‌వైజర్‌గా పనిచేసిన అభ్యర్థులకు వెయిటేజీ ఉంటుంది. ఎంపికైన వారికి నెలకు రూ.22,460 నుంచి రూ.72,810 వరకు జీతంగా చెల్లిస్తారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్‌శాఖలో అదనంగా 26 డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ) పోస్టులను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం (జనవరి1) ఉత్తర్వులు జారీ చేసింది. 2020లో డిప్యూటీ డైరెక్టర్ కేడర్‌లో 51 డీడీఓ పోస్టులను ప్రభుత్వం సృష్టించింది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణకు రెవెన్యూ డివిజన్‌కు ఒకరు చొప్పున డీడీఓని నియమించింది. రాష్ట్రంలో జిల్లాల సంఖ్యను 26కి పెంచడంతో, రెవెన్యూ డివిజన్ల సంఖ్య 77కి చేరింది. దీంతో కొత్తగా ఏర్పాటైన రెవెన్యూ డివిజన్లు పలాస, బొబ్బిలి, చీపురుపల్లి, చింతూరు, భీమునిపట్నం, తాడేపల్లిగూడెం, ఉయ్యూరు, తిరువూరు, నందిగామ, బాపట్ల, చీరాల, రేపల్లె, సత్తెనపల్లి, కనిగిరి, పత్తికొండ, ఆత్మకూరు, డోన్, గుంతకల్, పుట్టపర్తి, బద్వేల్, పులివెందుల, రాయచోటి, నగరి, పలమనేరు, కుప్పం, శ్రీకాళహస్తి కేంద్రాలకు డీడీఓ పోస్టులను మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్-2024) పరీక్ష అడ్మిట్ కార్డులు బుధవారం విడుదలయ్యాయి.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU,***
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in